క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచెంద్రి గ్రామంలో గల భువనేశ్వరి సహిత పరమేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శివపార్వతుల కల్యాణం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

స్వమిత్వ సర్వేపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యం

జలుమూరు: స్వమిత్వ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. మాకివలస గ్రామంలో గురువారం స్వమిత్వ సర్వే నిర్వహించి అనంతరం గ్రామ సభలో మాట్లాడారు. గ్రామ కంఠం అనుభంలో ఉంటే దానిపై పూర్తిస్థాయి హక్కులతో పత్రాలు పొందవచ్చన్నారు. వాటిని బ్యాంక్‌లలో కుదువపెట్టి రుణాలు పొందవచ్చన్నారు. క్రయవిక్రయాలు కూడా చేసుకోవచ్చన్నారు. డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 వేల పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న మూడడ్ల రమణ

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస గ్రామానికి చెందిన తుమ్మ పార్వతి కిడ్నీవ్యాధితో బాధపడుంది. ఈమెకు రూ.10వేల పింఛన్ ఇటీవల మంజూరైంది. ఈ పింఛన్ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ గురువారం అందజేశారు. స్థానిక సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి గురుగుబెల్లి రాము, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

పాతపట్నం ఎస్‌ఐగా మహమ్మద్ యాసీన్



ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్

పాతపట్నం: పాతపట్నం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా మహమ్మద్ యాసీన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం ఒకటో పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన జి.ప్రభాకరరావు శ్రీకాకుళం డీపీటీసీకి బదిలీ అయ్యారు. ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ మాట్లాడుతూ సరిహద్దులో శాంతిభద్రతల పరిరక్షిస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: నీలమణిదుర్గమ్మా చల్లగా చూడమ్మా అని జోడూరు గ్రామ ప్రజలు కోరుకున్నారు. గ్రామంలో గల పాతపట్నం నీలమణి దుర్గ ఆలయ 14వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. పంటలు సుభిక్షంగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ పశు బీమా సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగించుకోవాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకులు (ఏడీ) డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. మండలంలోని గోల్లపేటలో వైఎస్సార్ పశు బీమా పథకంపై పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పశువులు చనిపోతే రైతులు ఆర్థికంగా నష్టపోకుండా వైఎస్సార్ పశు బీమా పథకం ఉపయోగపడుతుందన్నారు. సంవత్సరానికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 చెల్లించాలన్నారు, లబ్ధిదారుడు 20 శాతం ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం 80 శాతం ప్రీమియం చెల్లిస్తుందన్నారు. పశువైద్యురాలు బొమ్మన శ్రీవాణి, సుబ్బారావు, నిరంజన్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన

విద్యుత్ పునరుద్ధరణ పనులు



ఎల్.ఎన్.పేట: యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు



ఎల్.ఎన్.పేట: మిరియాపల్లి వద్ద నేలరాలిన మామిడి కాయలు



ఎల్.ఎన్.పేట: మండల కేంద్రానికి సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాల

- ఈదురుగాలులకు నేలకొరిగిపోయిన స్తంభాలు, చెట్లు
- మామిడి పంటకు తీవ్ర నష్టం

ఎల్.ఎన్.పేట: మండలంలో బుధవారం రాత్రి వీచిన ఈదురు లులుకారణంగా అపార నష్టం జరిగింది. రావిచెంద్రి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మండల కేంద్రం వరకు, తురకపేట సెంటర్ నుంచి తురుకపేట గ్రామం వరకు, మండల కేంద్రం నుంచి మోదుగవలస వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు చెప్పారు. యంబరాం గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పడిపోయిందని, వైర్లు తెగిపోయాయన్నారు. మండలం వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం సాయంత్రం మండల కేంద్రంతోపాటు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్‌శాఖకు అపార నష్టం జరిగిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు చేపట్టారు. పది రోజులు వరకు పనులు చేసుకునేందుకు అవకాశం లేకుండా పంట పొలాల్లో వర్షం నీరు చేరింది. మామిడి రైతులకు నష్టం జరిగింది.

నేలకొరిగిన 18 విద్యుత్ స్తంభాలు

సారవకోట: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని పలు గ్రామాల్లో 18 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు విద్యుత్ శాఖాధికారులు గుర్తించారు. విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో గురువారం కొత్తవి వేసి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అంగూరు కుంభేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న రెండు భారీ చెట్లు నేలకొరిగాయి. సారవకోట, అంగూరు, సింగంవలస, కిడిమి, చోడసముద్రం, తదితర గ్రామాల్లో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.



ఎల్.ఎన్.పేట: తురకపేట వద్ద పొలాల్లో చేరిన వర్షం నీరు



సారవకోట: అంగూరు కుంభేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నేలకొరిగిన భారీ చెట్టు



సారవకోట: విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

బూర్జ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలోని లక్కుపురం గ్రామంలో పల్లెబాట కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటుచేసి గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహిళల పేరిట ఆసరా, చేయూత, జగనన్న కాలనీల ఇంటి పట్టాలు మంజూరు చేశామన్నారు. గతంలో ఎప్పుడూ లేనటువంటి అభివృద్ధి ఈ ప్రభుత్వంలో జరుగుతుందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, స్థానిక సర్పంచ్ వి.విజయలక్ష్మి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గుమ్మడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

హిరమండలం: స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పొన్నాన సుమంత్ (584), పోతల మోహన్ (581)ను ఎంఈఓ కె.రాంబాబు గురువారం అభినందించారు. రూ.13వేల నగదు బహుమతి అందించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.జ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విరమణ



కార్మికులతో సమ్మెను విరమింపజేస్తున్న రమేష్‌కుమార్

పొందూరు: పొందూరు పంచాయతీలో వారం రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మెను వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ గురువారం విరమింపజేశారు. వేతనాల పెంపునకు సంబంధించి వీరంతా చేస్తున్న సమ్మెకు పార్టీ నాయకులు జిల్లా పంచాయతీ అధికారితో సంప్రదింపులు జరిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్మికులకు రూ.15 వందల చొప్పున వేతనాలను పెంచుతూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు కార్మికులకు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింపజేశారు.

దోమల నివారణకు చర్యలు

మెళియాపుట్టి: మలేరియా నివారణలో భాగంగా ప్రతీ ఇంటి లోపలి గోడలకు దోమల నివారణ మందులను స్ప్రేచేయాలని చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పావని అన్నారు. మండలంలోని పెద్దగుమ్మడ, గోపినాథపురం గ్రామాల్లో గురువారం దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న సీఎఫ్ఎల్ అధికారి సీహెచ్ వెంకటేష్

ఆమదాలవలస రూరల్: మహిళలు, గ్రామీణప్రాంతాల్లో యువత సైబర్ మోసాలకు గురికావద్దని సీఎఫ్ఎల్ అధికారి సీహెచ్ వెంకటేష్(చిన్నూ) సూచించారు. మండలంలోని దన్నానపేట గ్రామంలో గురువారం ఆర్‌బీఐ ఆదేశాలమేరకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930, రిజర్వ్ బ్యాంకు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సీఎఫ్ రమణమ్మ, దన్నానపేట గ్రామస్తులు, సీఎఫ్ఎల్ సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత మహోత్సవం



అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలో గల సంతోషిమాత ఆలయ, ఉత్సవమూర్తి ప్రతిష్ఠోత్సవం గురువారం కన్నుల పండువగా సాగింది. అర్చకుడు రాజేశ్వర శర్మ, గణపతిశర్మ ఆధ్వర్యంలో విశేష, పూర్ణాహుతి హోమాలు, విగ్రహప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించామని గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాదం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాగువాడ, కొరసవాడ గ్రామస్తులతోపాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి సంతోషిమాత అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, ఆలయ కమిటీ భజన బృందం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన



చిన్నారులతో మాట్లాడుతున్న కార్యదర్శి శంకరరావు

కొత్తూరు: కొత్తూరు మండల శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి వీజీఎస్ శంకరరావు గురువారం పరిశీలించారు. నెల రోజుపాటు వేసవి శిక్షణలో విద్యార్థులు నేర్చుకున్న పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో చదివించడం, రాయిండంతోపాటు పలు రకాల కథలను చెప్పించారు. గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు సకాంలో లభించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయానికి పాఠకులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాధికారి ఇందిరకు ఆదేశించారు. రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



స్వామివారి ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని అవలింగి గల విజయగణపతి స్వామి వారి తిరువీధిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చనలు చేపట్టారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అవలింగి, చీడిపూడి, బుడితి గ్రామాల్లో తిరువీధి నిర్వహించారు.

దివ్యపథం వితరణ



మందిరానికి దివ్యపథం అందజేస్తున్న రామరాజు

పాతపట్నం: పాతపట్నంలోని సత్య సాయి బాబా మందిరానికి పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు దివ్యపథం (వెల్‌వెట్ క్లాత్) వితరణ చేశారు. ఈ మేరకు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు ఆధ్వర్యంలో పాతపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్‌కు నాగులపల్లి శ్రీనువాసరావు గురువారం అందజేశారు. జోనల్ కన్వీనర్ కె.వి.రమణమూర్తి, బి.సత్యనారాయణ, జి.సుదర్శన్‌రావు, పి.రామారావు, చిన్నారావు, ఆనంతకృష్ణ, రాంబాబు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు

- మనబడి–నాడు–నేడు సమీక్షలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి మనబడి నాడు–నేడు పథకంపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో 250 స్కూళ్ల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రెండో విడతలో 112 పాఠశాలల్లో రూ. 51 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ, ఏ ప్రభుత్వ కాలంలో స్కూళ్లపై ఇంత శ్రద్ధ, ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రైవేట్ స్కూళ్లతో పోటీగా విద్యార్థులు మార్కులు పొందారన్నారు. ప్రభుత్వం ఒక మంచి ఆశయంతో పాఠశాలల అభివృద్ధికి నిధులు వెచ్చిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ ప్రతినిధులకు సూచించారు. మండలాల వారిగా నాడు–నేడు పనుల తీరుపై ఏపీసీ జయప్రకాశ్ సమీక్ష చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. డీఈఓ తిరుమల చైతన్య, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, నాలుగు మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, చింతు రామారావు, తంగి మురళి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సమన్యాయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే్య ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని బద్రి గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రరావు నాయుడు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న బెక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం వచ్చి ఈ నాలుగేళ్ల అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు, అక్షరాస్యతలో కేరళతో పోటీ పడేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. దీనికి ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, జెడ్పీటీసీ సభ్యురాలు వరుదు నాగేశ్వరి, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య , సర్పంచ్‌లు భాస్కరరావు, బాడాన కృష్ణారావు, గోవిందరావు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు, నక్క తులసీదాస్, రావాడ శ్రీనివాసరావు, నిక్కు కృష్ణారావు, బోర శ్రీరామమూర్తి, పొన్నాన వైకుంఠరావు, పొన్నాన హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనపురం గ్రామానికి రోడ్డు వేయాలని వినతి

సారవకోట మండలంలోని గోవర్ధనపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని యువకులు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు వినతిపత్రం అందించారు. పెద్దలంబ నుంచి సారవకోటకు కలిపే రోడ్డు పూర్తిగా శిథిలమైందని, దీనిని పునర్ నిర్మించాలని కోరారు.

శివారు భూములకు సాగునీరు అందిస్తాం

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: శివారు భూములకు సాగునీరు అందించేందుకు వంశధార కాలువల్లో యుద్ధప్రాతిదికన పూడికతీసి రైతుల ఇబ్బందులు తొలగించనున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కిల్లివానిపేట వద్ద 20ఆర్ కూర్మనాథపురం వంశధార కాలువలో పూడికతీత పనులు గురువారం ప్రారంభించారు. ఓపెన్ హెడ్ కాలువలు, 3ఆర్ నడగాం నుంచి 20ఆర్ కాలువలు, అనుబంధ కాలువల్లో గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు తొలగించేందుకు ఉపాధి, మండల పరిషత్ నిధులు వెచ్చించనున్నామన్నారు. ఎంపీపీ వాన గోపి, డీఈ బగ్గు సత్యనారాయణ, సర్పంచ్ జుత్త నేతాజీ, ఎంపీటీసీ సభ్యుడు హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోన దామోదరరావు, పొన్నాడ విజయ్ పాల్గొన్నారు.

వైద్యాధికారిపై ఫిర్యాదు



వైద్య సిబ్బంది, రోగులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు

కొత్తూరు: మండలంలోని సోమరాజపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ గైర్హాజరుకావడంతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఇతర అధికారులు, టోల్ ఫ్రీ నంబర్లకు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీరవప్రసాదరావు, సోమరాజపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు శిమ్మ మధుసూదనరావు ఫిర్యాదు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమానికి వైద్యాధికారి హాజరుకాకపోవడంతో ఆయన తీరుపై మండిపడ్డారు. గత మూడు రోజులుగా వైద్య శిబిరాలకు హాజరుకావడం లేదని పలువురు సర్పంచ్‌లు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వైద్య సిబ్బంది, సర్పంచ్ శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సంజీవరావు, బర్రి గోవిందరావు, పడాల వెంకటకృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాలు



మాట్లాడుతున్న లోతుగెడ్డ తిరుపతిరావు

కొత్తూరు: రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న వరి విత్తనాలను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు కోరారు. కర్లెమ్మ రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులతో మహసింగిగూడ గిరిజన గ్రామంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. వరి విత్తనాల కోసం ఆర్‌బీకేలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కర్లెమ్మ ఆర్‌బీకే పరిధిలో 525 మంది రైతులకు రైతు భరోసా పథకం కింద రూ.5,500 చొప్పున జమ చేసినట్లు చెప్పారు. భూయజమాని మృతి చెందితే.. భార్య పేరున ఆ భూమిని నమోదు చేస్తే రైతు భరోసా మంజూరవుతుందన్నారు. రైతులకు సీఎం జగన్ అందిస్తున్న పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.